సీఎంకు రక్షాబంధన్



రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి రక్షాబంధన్ కట్టారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా ఇర్రిపాక పర్యటనకు వచ్చిన సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు.
– సాక్షి, పాడేరు

ప్రకృతి దేవతలకు ప్రణామం

- గ్రామల్లో జోల్డా పండగ సందడి
- పంట భూముల్లో నాటిన ఔషధ గుణాల కొమ్మలు
- పంచ భూతాలకు గిరిజనుల పూజలు



జి.మాడుగులలో జోల్డా కొమ్మలను పొలాల్లో నాటుతున్న రైతు



జి.మాడుగులలో శంకుదేవునికి పూజలు చేస్తున్న గిరిజనులు

సాక్షి, పాడేరు : ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో గిరిజనులకు పూర్వం నుంచి ఆచార సంప్రదాయంగా వస్తున్న జోల్డా పండగ బుధవారం ఏజెన్సీ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. ప్రకృతి దేవతలకు, పంచ భూతాలకు పూజలు చేయడం ఈ జోల్డా పండగలో గిరిజన కుటుంబాల ఆనవాయితీ. ఖరీఫ్ వరినాట్లు పూర్తయిన తర్వాత గిరిజనులంతా తమ పంట భూముల్లో జోల్డా పండగను జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా జోల్డా పండగ సందడి నెలకొంది. గత వారం నుంచే మన్యంలో జోల్డా పండగ ప్రారంభమైంది. ఈ బుధవారం కూడా పాడేరులోని గుడివాడ, లోచలిపుట్టు, కుజ్జెలి, తుంపాడ, రాములపుట్టు, గెడ్డంపుట్టు గ్రామాల్లో జోల్డా పండగను గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

ప్రత్యేక పూజలు

గిరిజన రైతులు తమ ఖరీఫ్ వరి పంట భూముల్లో పంటలు బాగా పండాలని, చీడపీడల భారీ నుంచి పంటను కాపాడాలని ప్రకృతి దేవతలు, పంచభూతాలకు పూజలు చేయడం జోల్డా పండగ ప్రధాన ఉద్దేశం. జోల్డా పండగను పూర్వం నుంచి బుధవారం రోజు మాత్రమే ఈ సీజన్‌లో గిరిజన రైతులు జరుపుకుంటారు. జోల్డా పండగతో పేద, ధనిక, కుల,మతాలకు అతీతంగా అన్ని వర్గాల గిరిజనులు ఆయా గ్రామాల్లో సందడి చేస్తుంటారు. వేకువజామునే స్నానం చేసి గ్రామదేవత శంకులమ్మ తల్లికి పూజలు జరిపే గిరిజన పూజారి వద్ద అక్షింతల రూపంలో బియ్యం పొంది, వాటిని ఇతర బియ్యంతో కలిపి ఇంటి వద్ద వంట చేస్తారు. తమ స్తోమతను బట్టి కోళ్లు, మేకలు, గొర్రెలు బలివ్వడం ఈ జోల్డా పండగలో ఆనవాయితీ. ప్రకృతి దేవతలతో పాటు పంచ భూతాలైన గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశంలకు పూజలు చేయడం జోల్డా పండగలో ప్రధాన ఘట్టం.

ఔషధ జాతుల కొమ్మల సేకరణ

జోల్డా పండగతో గిరిజన రైతులు గత రెండు రోజుల నుంచి అటవీ ప్రాంతాల్లో దొరికే పలు రకాల ఔషధ జాతుల వృక్షాల కొమ్మలను సేకరించుకున్నారు. ఔషధ గుణాలు అధికంగా ఉండడంతో పాటు పంటలకు చీడపీడల నివారణకు కూడా దోహదం చేసే కసిమి కొమ్మ, నల్ల జోల్డా, చీడి కొమ్మ, సీత కొమ్మ, మంగ కొమ్మ, జంతరంగి(జీలుగ) కొమ్మలను ఈ జోల్డా పండగకు గిరిజన రైతులు ఉపయోగిస్తారు. సంప్రదాయం, ఆచారం ప్రకారం ప్రతి గిరిజనుడు ఆయా కొమ్మలను సేకరించి వాటిని బుధవారం నిర్వహించిన జోల్డా పండగకు ఉపయోగించారు. అన్ని రకాల కొమ్మలను పంట భూముల వద్దకు కుటుంబ సమేతంగా తీసుకువెళ్లిన గిరిజన రైతులు ప్రకృతి దేవతలు, పంచ భూతాలకు పూజలు జరిపారు. పసుపు, కుంకుమతో వృక్ష జాతుల కొమ్మలకు పూజలు చేసి భక్తి శ్రద్ధలతో ఆ కొమ్మలను పంట భూముల్లో నాటారు. ఈ కొమ్మలు ఆ పంట భూమిలో నాటడం ద్వారా చీడపీడల నివారణతో పాటు ఆ కొమ్మలపై పిట్ట జాతులన్ని వాలి క్రిమికీటకాలను నాశనం చేస్తాయని గిరిజన రైతుల నమ్మకం.

కుటుంబసమేతంగా పొలాల్లో భోజనాలు

జోల్డా పండగను భక్తి శ్రద్ధలతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్న గిరిజనులంతా తమ కుటుంబ సమేతంగా పంట భూముల వద్దే విందు భోజనాల కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఇంటి వద్ద తయారు చేసి మాంసాహార వంటకాలు, అన్నం, ఆహార పదార్థాలను అడ్డాకుల డొప్పలో వేసుకుని ఆ పంట భూముల వద్దే తిని ఆ ఎంగిలి ఆకులను పంట భూముల్లోనే పారవేయడం కూడా ఈ జోల్డా పండగలో ఆచారం.వచ్చే బుధవారం మరిన్ని గ్రామాలలో జోల్డా పండగకు గిరిజనులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

జి.మాడుగుల: మండలంలో జీఎం కొత్తూరు, ఇతర గ్రామాల్లో జోల్డా పండగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. అటవీ ప్రాంతాల్లో లభించే కసిమి, జోల్డా, జీలుగు, సీత, తదితర ఔషధ మొక్కలను గిరిజనులు సేకరించి ఆయా కొమ్మలను గ్రామంలోని గిరిజన పూజారి శంకుదేవుని సన్నిధిలో వద్ద ఉంచి ప్రత్యేక పూజలు జరిపి, కొమ్మలను రైతులను అందించారు. రైతు కుటుంబాలన్నీ ఒక చోట చేరి పంట పొలాల వద్ద విందు భోజనాలు చేశారు.

గ్రామాల్లో చురుగ్గా ఈ-క్రాప్



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా సాగులో పంటల వివరాలు సేకరించే ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. మండలంలో 5,649 ఎకరాల్లో వరి సాగవుతోంది. కాగా ఇప్పటి వరకు 3,700 ఎకరాల్లో నాట్లు పడినట్టు ఏఓ రమేష్‌నాయుడు తెలిపారు. 650 ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయినట్టు చెప్పారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 170 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 69,37 ఎకరాలు, జీడిమామిడి సాధారణ విస్తీర్ణం 4,620 ఎకరాలు కాగా ఇంత వరకు 797.44 ఎకరాల్లో ఈ-క్రాప్ చేశామన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 12వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉండగా ఇప్పటివరకు 1616.6 ఎకరాల్లో ఈ-క్రాప్ పూర్తయినట్టు ఏఓ తెలిపారు. ప్రతి రైతు తాము సాగుచేస్తున్న పంటల వివరాలను తెలపాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ జరిగితేనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించుకోవచ్చని, బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రామరాజు, ప్రదీప్ పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

చింతూరు: సామాన్యులపై భారాలు వేసే విధానాలపై పోరాడాలని సీపీఎం నాయకులు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరభేరిలో భాగంగా బుధవారం వారాంతపు సంతలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలతో పాటు విద్యుత్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కోరారు.

క్లుప్తంగా

చిత్తశుద్ధితో పనిచేస్తే తగిన గుర్తింపు

చింతపల్లి: ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తే తగిన గుర్తింపు వస్తుందని చింతపల్లి క్లస్టర్ రిటైర్డ్ ఏపీడీ లావేటి రామారావు అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన రామారావును బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సహచర ఉద్యోగులు సన్మానించారు. ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. చిత్తశుద్ధితో పనిచేసినప్పుడు తగిన గుర్తింపు వస్తుందన్నారు. ఏపీవోలు లక్ష్మీనారాయణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు బూదరాళ్లలో గడప గడపకు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ గరిమండ, వంతమర్రి, కునుకూరు, బాలరేవుల గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


రాజ్‌మా విత్తనాల పంపిణీ



సావ్వలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సాయిత

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రాజ్‌మా విత్తనాలను సర్పంచ్ పాండొయి సాయిత చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయిత మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రాజ్‌మా విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతో శ్రమిస్తుందన్నారు. పంచాయతీలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ సిద్ధంగా ఉన్నాయని హార్టికల్చర్ అసిస్టెంట్ కిల్లో రాములమ్మ అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌కుమార్, రాంప్రసాద్, గురునాయుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

3,200 లీటర్ల పులుపు ధ్వంసం



సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొయ్యూరు: చీడిపాలెం పంచాయతీ పోతవరం సమీపంలో సారా బట్టీలపై ఎస్‌ఐ రాజారావు ఆధ్వర్యంలో బుధవారం దాడులు చేశారు. 3,200 లీటర్ల పులుపును ధ్వంసం చేశారు.దీంతో పాటు సారా తయారీకి ఉపయోగించే కొన్ని వంటపాత్రలను కూడా ధ్వంసం చేశారు.సారా తయారు చేస్తున్న ఆదాకులకు చెందిన సుమన్ అతని భార్య కొండమ్మ గుర్తించామని, వారిని త్వరలో అరెస్టు చేస్తామని ఎస్‌ఐ రాజారావు చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఏపీఎస్‌పీ పోలీసుల సహకారంతో దాడులు చేశామన్నారు. సారా ఎవరు తయారు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజ్‌మా సాగుకు సన్నద్ధం



రాజ్‌మా విత్తనాలు జల్లుతున్న గిరిజన రైతులు

- ప్రభుత్వ ప్రోత్సాహం
- సబ్సిడీపై విత్తనాలు అందజేత
- ఆనందంలో అన్నదాత

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు రాజ్‌మా సాగుపై పూర్తిగా దృష్టి సారించారు. ప్రస్తుతం మన్యంలో వాతావరణం అనుకూలించడంతో సాగు పనులు ప్రారంభమయ్యాయి. సేంద్రియ పద్ధతిలో మెట్ట, కొండపోడు భూముల్లో సాగు చేసేందుకు పనులను మొదలుపెట్టారు. రాజ్‌మా సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో ఆర్‌బీకేల ద్వారా విత్తనాల పంపిణీ చేయడంతో సాగు విస్తీర్ణం సైతం రైతులు పెంచుకొని పోతున్నారు.

జోరందుకున్న విత్తు పనులు

అరకు, పాడేరు డివిజన్‌ల్లో 11 మండలాల్లో ఈ పంటను 9,400 హెక్టార్ల విస్తీర్ణంతో సాగు చేస్తున్నారు. గిరిజన గ్రామాల్లో ప్రతి ఏడాది ఆగస్టు రెండు, మూడు వారాల్లో ఎంపిక చేసుకున్న భూముల్లో రాజ్‌మా విత్తనాలను జల్లి సాగుకు సన్నద్ధమవుతారు. ప్రస్తుతం విత్తనాలు తీసుకున్న రైతులు రాజ్‌మా పంటను వేస్తున్నారు. కొండ, మెట్ట భూములను సిద్ధం చేసుకొని విత్తనాలు జల్లుతున్నారు. గత ఏడాది రాజ్‌మా పంటకు మంచి ధర పలకండంతో అధిక శాతం రైతులు రాజ్‌మా సాగుపై దృష్టి పెట్టారు. తెలుపు రాజ్‌మా కిలో రూ.110, ఎరుపు రాజ్‌మా కిలో రూ.80 నుంచి రూ.90 వరకు ధరతో విక్రయించి, రైతులు లాభాలు పొందారు. ఈ ఏడాది ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా విత్తనాల పంపిణీ

ఆర్‌బీకేల ద్వారా రాజ్‌మా విత్తనాలు జోరుగా పంపిణీ జరుగుతున్నాయి. ఎకరానికి 10 కిలోల చొప్పున 90శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ జరుగుతుంది. అరకు-450 క్వింటాళ్ల, డుంబ్రిగుడ-340క్వింటాళ్ల, ముంచంగిపుట్టు- 294క్వింటాళ్ల, హుకుంపేట-300క్వింటాళ్ల, అనంతగిరి-275క్వింటాళ్ల, పెదబయలు-300 క్వింటాళ్ల చొప్పున రాజ్‌మా విత్తనాలు ఇప్పటి వరకు పంపిణీ జరిగింది. ప్రభుత్వ లక్ష్యం మేరకు విత్తనాలు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

'గడప గడప'తో సమస్యల పరిష్కారం



గుడ్లపల్లిలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పక్కన నేతలు



చీకుమద్దులలో గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు

కొయ్యూరు: గడప గడపకు కార్యక్రమం మూలంగా మారుమూల ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించినట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మర్రివాడ సచివాలయం పరిధిలోని గుడ్లపల్లి, పిడతమామిడి, మర్రివాడ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 300 గడపలను ఆమె సందర్శించారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకొని, పరిష్కరించే అవకాశం కలుగుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. టీడీపీ అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తుందన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి రానున్న ఎన్నికల్లో మద్దతు ఇచ్చి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుపించాలని కోరారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, సర్పంచ్ మాదల సత్యవతి, ఎంపీటీసీలు గంగాభవానీ, కె.అర్జమ, వైస్ ఎంపీపీ ఎ.వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, పార్టీ కన్వీనర్ సుధాకర్, ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ట్రైకార్ డైరెక్టర్ ఎస్.లోవరాజు, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆర్.ముసిలినాయుడు, ఎంపీటీసీ మల్లేశ్వరి, పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు గంగాధర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే పేదల బతుకుల్లో వెలుగులు

హుకుంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గడప వద్దకే ప్రభుత్వ సేవలందుతున్నాయని, దీంతో పేదల బతుకుల్లో వెలుగులు కనిపిస్తున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మారుమూల చీకుమద్దుల పంచాయతీ కేంద్రంతో పాటు కారేగరువు, మచ్చమామిడి, ముసిరిపాడు, బొడ్డపాడు, పెద నందిపుట్టు, చిన్న నందిపుట్టు, రంగరాజుపల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 296 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పాల్గుణ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేనంత అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తు గడప వద్దకే సంక్షేమ పాలన అందుతోందన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు చీకుమద్దుల రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అంతే కాకుండా సెల్ టవర్లు నిర్మించి సెల్ సిగ్నల్ సమస్య తీర్చమన్నారు. సర్పంచ్‌లు సోకేలి కృష్ణారావు, సూకురు బొంజన్నదొర, సన్నిబాబు, లక్ష్మయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శోభ ధర్మయ్యదొర, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సైని సత్తిబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఎస్.కొండలరావు, వైస్ ఎంపీపీ(సీపీఎం) సుడిపల్లి కొండలరావు, నాయకులు సదాశివరాజు, కోటిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు,వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఎంపీడీవో కె.బాపన్నదొర బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారుల సూచనలను అనుసరించి నిర్దేశిత అంశాలపై బాధ్యతగా పనిచేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో జనన, మరణ, ఆధార్ కార్డు లేని వారి వివరాలు సేకరించాలని సూచించారు. డ్రాపౌట్‌లను గుర్తించాలన్నారు. కాపు నేస్తం, జగనన్న తోడు, వలంటీర్ ఎడ్యుకేషనల్ సర్వే పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్‌కి సరెండర్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం గొండోలు సచివాలయాన్ని ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనుల్లో లేబర్ రిపోర్టు నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. లేబర్ బడ్జెట్ మేరకు లక్ష్యసాధన అడిగి తెలుసుకున్నారు.ఆధార్ సీడింగ్ క్రమం తప్పకుండా నూరుశాతం పూర్తి చేయాలన్నారు. డిలేటెడ్ జాబ్ కార్డుల వివరాలు, ఏడు రిజిష్టర్లు నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు.

ప్రకృతి వ్యవసాయంపై నేపాల్ బృందం అధ్యయనం



భీరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న నేపాల విద్యార్థుల బృందం

జి.మాడుగుల: రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలో రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను నేపాల్ విద్యార్థుల బృందం పరిశీలించింది.ఎం. నిట్టాపుట్టు, భీరం, మధురమామిడి గ్రామాల్లో పర్యటించింది. ఈ ప్రాంతంలో అవలంభిస్తున్న విధానాలను తమ దేశంలో ఆచరించేందుకు అధ్యయనం చేస్తున్నామని బృందం సభ్యులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలపై రైతు సాధికార సంస్థ ఎం. నిట్టాపుట్టు యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్ అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు వివరించారు. కాఫీ, మిరియం, పసుపు, రాజ్‌మా తదితర వాణిజ్య పంటల ఆదాయం పెంచేందుకు చేసేందుకు చేస్తున్న కృషిని ఎఫ్‌సీవో మేనేజర్ గంగరాజు తెలిపారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధి తరుణ్, మండల ఇన్‌చార్జి వెంకట్, ప్రసాద్, పాపారావు, రామలింగం, సురేష్, ఎస్ శ్రీను, పి కొండమ్మ, కె.మత్స్యమ్మ పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ వేడుకలు

చింతపల్లి: అన్నా చెల్లెల బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగను మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణిలు తమ సోదరులకు రాఖీలు కట్టి ప్రేమ, అప్యాయతను చాటుకున్నారు. రాఖీ సందర్భంగా ఎంపీపీ కోరాబు అనుషాదేవి శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రదానంపై అపోహలు వీడాలి



పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు

పాడేరు రూరల్ : నేత్రదానం అన్ని దానాల కన్నా గొప్పదానమని ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యతగా చనిపోయిన తర్వాత తమ నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు సూచించారు. 38వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా బుధవారం పాడేరు పట్టణంలోని లోచలిపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ మనిషి మరణాంతరం అత్యంత ముఖ్యమైన కళ్లు నశింపకూడదన్నారు. మరణాంతరం కళ్లు దానం చేస్తే అంధులకు చూపు ఇచ్చిన వారవుతారన్నారు. నేత్రదానంపై అపోహలు విడనాడాలన్నారు. నేత్రదానంపై ఆసక్తి ఉన్నవారు జిల్లా మొహిసిస్ ఐ బ్యాంకుకు నేరుగా అందజేయవచ్చన్నారు. ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీ, హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని లబ్బూరు గ్రామంలో బుధవారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. వైద్యాధికారి ప్రతాప్ మాట్లాడుతూ మరణించిన తర్వాత నేత్రదానం చేయడంతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన వారమవుతాయన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా నేత్రదానంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఆప్తాలమిక్ అసిస్టెంట్ కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర నేడు

అనకాపల్లిటౌన్: నమ్మి కొలిచిన వారి కొంగు బంగారం కోట్నీవీధి మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు, కోరుకొండ రాఘవ మిత్ర మండలి బృందం ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు శ్రీసత్యసాయిభజన మండలి వారిచే అమ్మవారి మేలుకొలుపు సేవ, అనంతరం అమ్మవారికి పలురకాల అభిషేకాలు, ప్రత్యేక కుంకుమార్చనలు జరగనున్నాయి. తర్వాత మేళతాళాల నడుమ అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. నవదుర్గ పీఠం వారిచే పూల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమీయనున్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కమిటీ సభ్యులు కోరారు. అమ్మవారి జాతర సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు నేలడ్యాన్స్‌లు, సాయంత్రం 4 గంటలకు ఏలి ఏనుగు ఊరేగింపు, రాత్రి 7 గంటలకు కోరుకొండ రాఘవ మిత్ర మండలి సహకారంతో మా నమ్మకం నువ్వే జగన్, బాడీబిల్డింగ్ షో, జై చంద్రన్న డ్యాన్స్, కోలాటం, తప్పెటగుళ్లు, తోడపెద్దు సేవ సాంస్కృతిక కార్యక్రమాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి



శివలింగపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ నీలవేణి

అనంతగిరి: డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించాలని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండలంలో గల శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. 50 మందిపైగా విద్యార్థులు డ్రాపౌట్ ఉన్నట్టు ఆమె గుర్తించారు. వెంటనే ఆయా గ్రామాలకు వెళ్లి విద్యార్థులను పాఠశాలలో చేర్పించే ప్రయత్నం చేయాలని హెచ్‌ఎం రాంబాబుకు సూచించారు. చదువుకునే విద్యార్థులు పాఠశాలకు దూరం కాకుండా, విద్య యొక్క విలువను తెలియజేయాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం తుమ్మనవలస గ్రామంలో ఎంపీ నిధులతో మంజూరైన బస్సు షెల్టర్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఆమె పరిశీలించారు. కో-ఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.